సికింద్రాబాద్ ప్రధాన భవనం కూల్చివేత

-రూ. 720 కోట్లతో అత్యాధునిక స్టేషన్ -శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను కూల్చివేస్తున్న దృశ్యం

కంటోన్మెంట్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:
సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ శర వేగంగా జరుగుతున్న అభివృద్ధిలో భాగంగా జంట నగరాలలో ఒకటైన సికింద్రాబాద్ నగరానికి తలమానికంగా ఉన్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రధాన భవనాన్ని కూల్చివేశారు. అత్యంత అధునాతనంగా నిర్మిస్తున్న క్రమంలో అధికారులు రైల్వేస్టేషన్‌కు కిరీటంగా ఉన్న భవనం నేలమట్టం చేశారు. సంస్కృతి ఉట్టిపడేలా ఉన్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ భవనం చరిత్రగానే నిలువనుంది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ చరిత్రపుటను ఒకసారి తెరిచి చూస్తే అప్పటి నిజాం నవాబు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను 1874లో నిర్మించారు. అప్పటి నుంచి 1916వరకు నిజాం గ్యారెంటెడ్ స్టేట్ రైల్వేకు ఇదే ప్రధాన రైల్వేస్టేషన్‌గా ఉండింది. తరువాత 1951లో దీన్ని జాతీయం చేయడంతో ఇండియన్ రైల్వేలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ కూడా భాగమైంది. 1952 సంవత్సరంలో సికింద్రాబాద్ ప్రధాన రైల్వేస్టేషన్ భవనాన్ని నాటి ప్రభుత్వం నిర్మించింది. దీని పోర్టికో నిజాం ఆర్కిటెక్చర్‌కు అనుగుణంగా కోటను పోలి ఉంటుందంటారు. తాజాగా దీన్ని కూల్చివేసి అత్యాధునిక రైల్వేస్టేషన్‌ను నిర్మించడం కోసం కూల్చివేయాల్సి వచ్చింది.

విమానాశ్రయాలతో పోటీ పడేలా....
దాదాపు రూ. 720 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను విమానాశ్రయాలతో పోటీ పడే విధంగా అధునీకరించనున్నారు. దీంట్లో ప్రపంచస్థాయి మౌళిక వసతులు, సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఇటు సౌత్‌వైపు, అటు నార్త్‌వైపు జీప్లస్3 అంతస్థులతో స్టేషన్ భవనాలను నిర్మిస్తున్నారు. అంతే కాకుండా ప్రస్తుతం ఉన్నట్లుగానే అధునాతనంగా నిర్మిస్తున్న స్టేషన్‌లో కూడా రిటైల్ దుకాణాలు, భోజనశాలలు అందుబాటులో ఉంటాయి. అలాగే కొన్ని సంవత్సరాల కిందట ఏర్పాటు చేసిన ఎస్కలేటర్‌లాగే ఈ నిర్మాణంలో 32 ఎస్కలేటర్‌లు, 26 లిఫ్టులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికులు లోనికి వచ్చేందుకు రెండు నగక మార్గాలు, రెండు ఫుట్ బ్రిడ్జిలు ఉండనున్నాయి. దీంతోపాటు ఒక స్కైవేను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న మార్గంలోనే సికింద్రాబాద్ మెట్రోస్టేషన్‌కు మార్గాలు ఉండనున్నాయి. ప్రస్తుతం నిర్మిస్తున్న రైల్వేస్టేషన్ పార్కింగ్ ఏరియాను కూడా సౌకర్యవంతంగా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు ప్రయాణికులకు అవసరమైన నీటి వసతి కూడా ఎలాంటి లోటు లేకుండా సరిపడా నిలువలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. దాదాపు 400 కార్లు నిలిపేలా గణేష్ టెంపుల్ సమీపంలో పార్కింగ్ సౌకర్యం ఉంటుంది. ప్రస్తు రిజర్వేషన్ కార్యాలయం వద్ద దాదాపు అండర్‌గ్రౌండ్ వాటర్ సంపులు ఏర్పాటు చేయనుండడంతో పాటు రైలులైటింగ్ ఏరియాలో సమీపంలో రెండులక్షల లీటర్‌ల వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. అలాగే గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రయాణికుల పికప్, డ్రాప్ జోన్ పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయి.

హాజరు పేరుతో..అవినీతి దందా..!

-ఉపకార వేతనాలకు కొర్రీ -పరీక్షలకు అనర్హులంటూ ప్రకటన -డబ్బులు తీసుకుని అనుమతిస్తున్న కళాశాలలు

హైదరాబాద్, ఫి బ్రవరి 14,ప్రభాతవార్త:
విద్యాప్రమాణాలు పెంచేందుకు తప్పనిసరిగా హాజరు అవసరమని విద్యాశాఖ తీసుకున్న నిర్ణయం..కొన్ని కళాశాలల పాలిట ఆదాయ వనరుగా మారింది. కళాశాలలో ఆధ్యాపకులను భర్తీ చేయకుండా,మౌలిక వసతులు సమకూర్చకుండా విద్యార్థుల వచ్చి ఏమ లాభమని పలువురు విద్యార ంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా ఎక్కువ కళాశాలల్లో చాలా సబ్జెక్టులలో భోదకులే లేరు. ఉన్నకొద్ది మంది ఇతర పనుల్లో నిమగ్న మైపోయారు.కొందరు మాత్రమే తరగతి గదికి వెళ్లి అప్పుడప్పుడు భోదిస్తున్నారు. ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకుహాజరు 75శాతం తప్పనిసరిగా ఉండాలని నిబంధన పెట్టారు. అప్పుడే పరీక్షలకు అర్హులని విశ్వవిద్యాలయాలు ఇటీవల ఆదేశాలు జారీ చేశాయి. అనుబంధ కళాశాలలు వాటిన అమలు చేస్తున్నాయి. ఇప్పటికే చాలా కళాశాలలలో బయోమెంట్రిక్ అమర్చుకున్నాయి. కొన్ని కళాశాలలను మాత్రం ఈవిధానాన్ని వ్యతిరేకిస్తూ పరికరాలను సమకూర్చుకోలేదు. 2017లోనే పిజి కోర్సులకు బయోమెంట్రిక్ విధానాన్ని జెఎన్‌టీయూహెచ్ అమలులోకి తీసుకువచ్చింది. ఇదే విధానాన్ని యూజీ కోర్సులకు అమలు చేస్తుంది. పలు విద్యాలయాల్లో విద్యార్థులకు ఇప్పటికీ హాజరుపట్టీల విధానాన్ని అమలు చేస్తున్నారు.. 75శాతం హాజరులేని వారి నుండి ఇచ్చినంతగా కొన్ని కళాశాలలు దండుకుంటున్నాయి. హాజరు తక్కువ శాతాన్ని బట్టి మరింత ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నట్లు పలువురు విద్యార్థులు విమర్శిస్తున్నారు. హాజరు తక్కువ వచ్చిందనే కారణాన్ని చూపించి ఉపకార వేతనాలు,ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాలను విద్యార్థులకు దూరం చేస్తున్నారు. 75శాతం హాజరుకాలేదని,ఉపకార వేతనం,ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకానికి అనర్హులంటూ నగరంలోని కొన్ని కళాశాలలకు విద్యార్థులకు వివరిస్తున్నాయి. ఫీజు సాయం అందకపోతే ఈకోర్సులు చదవలేమని నిరుపేద కుటుంబాల విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. కొందరైతే మధ్యలోనే మానేస్తున్నారు. ఒక్కొక్క ఏడాదికి ముప్పైవేలకు పైగా సొంతంగా కట్టుకోవాల్సి వస్తుందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. గ్రేటర్ పరిధిలోని కొన్ని డిగ్రీ,ఇంజీనీరింగ్ కళాశాలల్లో ఉదయం నుండి సాయంత్రం వరకు ఒక్కరోజుకూడా తరగతులు పూర్తిగా జరిగిన సందర్భాలే ఉండటం లేదు. ఉదయం ఒకటి రెండు తరగతులు మాత్రమే జరుగుతున్నాయి. ఉస్మానియా, జెఎన్‌టియూహెచ్,తెలుగు యూనివర్సిటీ తోపాటు వీటి అనుంధ గుర్తింపుతో వేలాది కళాశాలలు నడుస్తున్నాయి. వీటిల్లో చాలావరకు కళాశాలల్లో పర్తిస్థాయిలో అధ్యాపకులే లేదు ఉన్నవారితో ఒకటిరెండు తరగతులు మాత్రమే జరుగుతున్నాయి. ఈ మాత్రం దానికి దూర ప్రాంతాలనుండి నుండి కళాశాలకు రావాలా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన ప్రస్తుత రోజుల్లో తరగతి గదుల అవసరం తగ్గిందన్నారు. దీనిని గుర్తించకుండా దూర ప్రాంతాల్లోని విద్యాసంస్థలకు నిత్యం రావాలనే నింధన ఎవరికి ఉపయోగం అని నిలదీస్తున్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణతకు అవసరమైన విజ్ఞానాన్ని తరగతి గదుల్లోనే నేర్చుకోవాల్సిన అవసరం లేదని, నిపుణుల బోధనలు ట్యుటోరియల్స్ అందుబాటులో ఉన్నాయని పలువురు విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

ఉప్పల్ స్టేడియంలో సెలబ్రిటి క్రికెట్ లీగ్ సందడి..!

-స్టేడియంలో పటిష్ట ఏర్పాట్లు - ప్రేక్షకుల లేక వెలవెల

ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో సెలబ్రిటీ క్రికెట్ మ్యాచ్ ఏర్పాట్లు వరిశీలిస్తున్న సిపి సుధీర్‌బాబు తదితరులు

ఉప్పల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :
ఉప్పల్‌లోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నేటి నుంచి రెండు రోజుల పాటు 11వ ఎడిషన్ సెలబ్రిటి క్రికెట్ లీగ్ -2025 టీ20 మ్యాచ్‌ల సందడి నెలకొంది. స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్ ఏర్పాట్లను శుక్రవారం రాచకొండ సిపి సుధీర్‌బాబు పరిశీలించారు. మ్యాచ్ సందర్భంగా స్టేడియంలో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. స్టేడియంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు సిపి సుధీర్‌బాబు తెలిపారు. స్టేడియంలో మ్యాచ్ చూసేందుకు వచ్చే ప్రేక్షకులకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ భారత్ పధకం ప్రమోట్ చేస్తూ ఏర్పాటు చేసిన హోర్డింగ్ మీద సిపి సంతకం చేశారు. కాగా ఉదయం నుంచి జరిగిన ఈ మ్యాచ్‌కు ప్రేక్షకుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. తక్కువ సంఖ్యలోనే ప్రేక్షకుల హజరైనట్లు నిర్వహకులు తెలిపారు. మ్యాచ్ పాసులు ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి

-ఎమ్మెల్యే శ్రీగణేష్

డ్రైన్ వాటర్, సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీ ఈటెల రాజేందర్,ఎమ్మెల్యే శ్రీగణేష్, కార్పోరేటర్ కొంతం దీపిక తదితరులు

కంటోన్మెంట్,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే 10 వేల కోట్ల రూపాయల వ్యయంతో గ్రేటర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఇందులో మోండా డివిజన్ అభివృద్ధికి 4 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్ తెలిపారు.శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని గురుద్వార్ దేవాలయ సమీపంలో 37 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న స్ట్రామ్ వాటర్ మురుగునీటి కాలువ, సీసీ రోడ్డు నిర్మాణం పనులను ఎంపీ ఈటెల రాజేందర్,మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, బేగంపేట్ సర్కిల్ డిపూయటీ కమిషనర్ సమ్మయ్యలతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్‌లోనే 8 వార్డులు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండడం వల్ల అభివృద్ధి పనులు జరగలేక పోతున్నాయన్నారు. కేంద్రం నుంచి రావాల్సిని సర్వీస్ ఛార్జీ కూడా రావడం లేదన్నారు. ఆ 8 వార్డులను జిహెచ్ఎంసిలో విలీనం చేస్తే కనీ, వినీ ఎరుగని రీతిలో అభివృద్ధి జరుగుతుందన్నారు. ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి కేంద్రం ప్రత్యేక నిధులు వెచ్చించిందన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్‌లోని కంటోన్మెంట్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కెటాయించడం జరిగిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. కార్పోరేటర్ కొంతం దీపిక మాట్లాడుతూ మోండా డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి జిహెచ్ఎంసి కమిషనర్ దృష్టికి తేవడంతోనే జనరల్ బడ్జెట్ కింద అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు చిరబోయిన సంతోష్ యాదవ్, అల్లాడి గౌరి శంకర్,నందికంటి రవి, బిజెపి నేతలు పిట్ల నాగేశ్, కొంతం నరేశ్, తదితరులు పాల్గొన్నారు. జీతూ గుప్త,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

- మణికొండలో రూ.5.కోట్ల 50.లక్షల పనులు ప్రారంభం

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో రూ.5కోట్ల 50.లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

నార్సింగి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : మణికొండ మున్సిపాలిటీలో మౌళిక వసతుల కల్పనకు పెద్దపీఠ వేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలో రూ.5.కోట్ల 50.లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను కమీషనర్ ప్రదీప్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రారంభించారు. మున్సిపల్ పరిధిలోని నెక్నాంపూర్,పుప్పాలగూడ, నెమలీనగర్‌లలో బస్తీ దవాఖానాలు ప్రారంభించారు. 4,8,18.వార్డులలో కాళోజి పార్కు, కేపిఆర్ పార్కు, అబ్దుల్ కలాం పార్కులలో అభివృద్ధి పనులు ప్రారంభించారు. అలాగే పుప్పాలగూడలో భూగర్భ డ్రైనేజి పనులు, సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల,మత,పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేస్తామని, ఆ తరువాత ప్రజల సమస్యలను పరిష్కరించడంపైనే దృష్టి పెడుతామని స్పష్టం చేశారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరిస్తుండడం వల్లనే వరుసగా నాలుగోమారు రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలు నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు కొండకళ్ల రామకృష్ణారెడ్డి, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కోట వేణుగౌడ్, బుద్దోలు శ్రీరాములు,పద్మారావ్,రాము పాల్గొన్నారు.

రమణీయం జనరంజకం సనాతన ప్రేమకథ సీతాయణం

సీతాయణంలో ఒక దృశ్యం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : అశోకవనంలో శోకరహితంగా రామ ఆగమనాన్ని అభిలషించే సీతమ్మ అనుక్షణం గత స్మృతుల్లోకి వెళులూ అడవిలో సంచరిస్తూ తన రాముని ప్రేమను ఆస్వాదిస్తూ ఇప్పుడు లంకలో అనుభవిస్తున్న జీవన విధానాన్ని సరికొత్తరకంగా, సూర్తికరంగా, సంపూర్తిక రంగా, నవనారి జీవనాదర్శకంగా సీతమ్మ ప్రేమతత్వానికి నిదర్శనం సనాతన ప్రేమకథ భానుమతి నరసింహన్ విరచించిన సీతాయణం రమణీయం, జనరంజకంగా సాగింది. శ్రీమాత కల్చరల్ ట్రస్ట్ సమారంభ వేడుకను పురస్కరించుకొని కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో శుక్రవారం రాత్రి బ్నిం రచన; క్రాంతి నారాయణ దర్శకత్వం; ఫణి నారాయణ సంగీత దర్శకత్వంలో రూపొందిన సీతాయణం నటీనటుల అద్భుత నటనకు దర్పణంపట్టి సభికులను సంభ్రమాశ్చర్యపరిచి రామాయణాన్ని తల పింపజేసింది. ఈ కార్యక్రమానికి పటేల్ రమేష్‌రెడ్డి, డా. ఎల్.వి.గంగాధర శాస్త్రి, బ్నిం, క్రాంతి నారాయణ తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొని జ్యోతిప్రకాసనంచేసి శ్రీమాత కల్చరల్ ట్రస్ట్‌ను లాంఛనంగా ప్రారంభించిన సీతాయణంలోని నటీనటులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన గూగుల్ ఇండియా బృందం

పంజగుట్ట, ఫిబ్రవరి 14 (ప్రభాతవార్త):
గూగుల్ ఇండియా ప్రతినిధుల బృందం తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ని సందర్శించి, ప్రస్తుత ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థను అధ్యయనం చేయడంతో పాటు, గూగుల్ యొక్క అత్యాధునిక సాంకేతిక పరిష్కారాలను వినియోగించి దీని కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి మార్గాలను అన్వేషించింది. ఇటీవల గూగుల్ , తెలంగాణ ప్రభుత్వం మధ్య కీలక రంగాలలో టెక్నాలజీ ఆధారిత వినియోగం పై కుదిరిన అవగాహన ఒప్పందం నేపథ్యంలో ఈ బృందం సందర్శించింది.ఈ ప్రతినిధి బృందంలో గూగుల్ డీప్ మైండ్ వైస్ ప్రెసిడెంట్ చందు తోట, గూగుల్ క్లౌడ్ వైస్ ప్రెసిడెంట్ రావు నూరపనేని, గూగుల్ కస్టమర్ సొల్యూషన్స్ కంట్రీ మేనేజర్ శాలిని పుచ్చలపల్లి, గూగుల్ డీప్ మైండ్ సీనియర్ డైరెక్టర్ శేషు అజ్జరపు ఉన్నారు. వీరితో పాటు గవర్నమెంట్ అఫైర్స్ పబ్లిక్ పాలసీ హెడ్ రాజేశ్ రంజన్, గవర్నమెంట్ అఫైర్స్ పబ్లిక్ పాలసీ ప్రతినిధి శ్రీనివాస్ కొడాలి హాజరయ్యారు.నగర పోలీస్ కమిషనర్ సి.వి. ఆనంద్,తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ కార్యకలాపాలపై సమగ్రమైన ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇందులో రియల్‌టైమ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఎలా నిర్వహించబడుతోందో, అధునాతన నిఘా వ్యవస్థలు, డేటా అనలిటిక్స్, గూగుల్ మ్యాప్స్ డేటాను అనుసంధానం చేయడం ద్వారా ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలను గుర్తించడం వంటి అంశాలను వివరించారు.గూగుల్ ప్రతినిధులు, పోలీస్ కమిషనర్ ఆనంద్ బృందం మధ్య చర్చలు ప్రధానంగా గూగుల్ మ్యాప్స్ యొక్క లైవ్ ట్రాఫిక్ డేటాను తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్కి అనుసంధానం చేయడం, వాహనాల స్థితిని ఆధారంగా చేసుకొని ఆటోమేటెడ్ ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను అభివృద్ధి చేయడం, రియల్‌టైమ్‌లో గస్తీ వాహనాల ట్రాకింగ్, ట్రాఫిక్ పర్యవేక్షణ కోసం డ్రోన్ నిఘా అమలు వంటి అంశాలపై జరిగాయి. ప్రస్తుత ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చడానికి అనేక వ్యూహాలను ప్రతినిధులు పరిశీలించారు.గూగుల్ నిపుణులు, సెంటర్ కార్యకలాపాలను మెరుగుపర్చేందుకు క్లౌడ్ పరిష్కారాలను ఉపయోగించడం, కొత్త ఆప్లికేషన్‌లను ప్రవేశపెట్టడం వంటి విషయాలపై విలువైన సూచనలు అందించారు. అలాగే, ప్రజా భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ సాంకేతికత ఆధారిత పరిపాలనను అమలు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వ నిబద్ధతను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో సహకారం కొనసాగించేందుకు గూగుల్ ప్రతినిధులు అంగీకరించారు. ఈ భాగస్వామ్యం అధునాతన ట్రాఫిక్ నిర్వహణ కోసం ఎంతో మేలు చేస్తుంది.సీసీ టీవీ ఫుటేజ్ డేటాను క్లౌడ్‌లోసేవ్ చేయడం ద్వారా 30 రోజుల పరిమితిని అధిగమించటం, అవసరమైన సందర్భాల్లో ఎఐ సాయంతో త్వరితగతిన అవసరమైన డేటాను తిరిగి పొందడం వంటి మెరుగైన మార్గాలను కూడా ప్రతినిధులు సూచించారు.

ఈ సమావేశానికి అదనపు సీపీ(ట్రాఫిక్) పి. విశ్వ ప్రసాద్ , జాయింట్ సీపీ (అడ్మిన్) జె. పరిమళ హాన నూతన్ ,పుష్ప, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

స్కూటీలో తరలిస్తున్న 500 గ్రాముల గంజాయి స్వాధీనం

గచ్చిబౌలి, ఫి బ్రవరి 14 ప్రభాతవార్త
స్కూటీలో తరలిస్తున్న 500 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజేంద్రనగర్‌కు చెందిన గణేష్‌సింగ్ అనే వ్యక్తి శుక్రవారం ఉదయం తన స్కూటీ వాహనంలో 500 గ్రాముల గంజాయిని తీసుకొని ఖాజాగూడకు వచ్చాడు. సదరు గంజాయిని వి.మహేష్, రవికుమార్ అనే వ్యక్తులకు విక్రయించేందుకు ఖాజాగూడకు తీసుకువచ్చాడు. కాగా ఖాజాగూడలో వాహనాల తనిఖీ చేస్తున్న రాయదుర్గం పోలీసులు అనుమానస్పదంగా కనిపించిన గణేష్‌సింగ్‌ను అదుపులోకి తీసుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఖాజాగూడలోనే ఉన్న కస్టమర్లు మహేష్, రవికుమార్‌లను సైతం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు గణేష్‌సింగ్‌కు గంజాయి ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరు విక్రయించారు అనే కోణంలో విచారణ చేపడుతున్నారు.

బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్..!

-తగ్గిన చికెన్ అమ్మకాలు -మటన్, చేపలకు పెరిగిన గిరాకీ

హైదరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:
ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ భయాందోళన కలిగిస్తోంది. కోళ్లకు వైరస్ సోకి పెద్ద ఎత్తున మృత్యువాత పడుతుండటంతో.. జనాలు చికెన్ తినేందుకు భయపడుతున్నారు.బర్డ్ ఫ్లూ కారణంగా చికెన్ ధరలు కూడా భారీగా తగ్గిపోయాయి. కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.210లు, విత్ స్కిన్ కిలో రూ.190 చొప్పున ధరలు పడిపోయినా కొనుగోలుదారులు ఆసక్తి చూప డంలేదు. చికెన్ అమ్మకాలపై బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ భారీగా పడింది. బర్డ్ ఫ్లూపై సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ అవుతున్న నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో సగానికి పైగా చికెన్ అమ్మకాలు తగ్గాయి. నగరంలో నిత్యం దాదా పుగా 6 లక్షల కిలోల చికెన్ అమ్మకాలు జరుగుతాయి.గత 23 రోజులుగా 50 శాతం కూడా అమ్మకాలు జరగడం లేదని వ్యాపారులు అంటున్నారు. గిరాకీ లేక చికెన్ దుకాణాలు ఖాళీగా కనిపిస్తున్నాయి.దానికి తోడు రోజూ నగరంలో ఆక్కడక్కడ కుళ్లిన చికెన్ నిల్వలు బయటపడుతున్నాయి. గురువారం కంటోన్మెంట్ ప్రాంతంలో అధికారుల తనిఖీల్లో సుమారు ఐదు క్వింటళ్ల కుళ్లిన చికెన్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఈ నేపథ్యంలో చికెన్ ముట్టుకోవడానికి నగర వాసులు జంకుతున్నారు. హోటల్స్, రెస్టారెంట్లలో కూడా చికెన్ మెనూ ఆర్డర్లు పూర్తిగా తగ్గిపోయాయి. బర్డ్ ఫ్లూ భయంతో ప్రజలు చికెన్‌కు బదులుగా.. మటన్, చేపల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో మటన్, చేపలకు భారీగా గిరాకీ పెరిగింది.

ఋతుస్రావ ఆరోగ్యం పై అవగాహన

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

హైదరాబాద్, ఫిబ్రవరి 14,ప్రభాతవార్త:

ఋతుస్రావ ఆరోగ్యం పై మర్మామ్ రెసొనేటింగ్ రెసిలెన్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యావేత్త ఆంచల్ అగర్వాల్, హోలిస్టిక్ చైల్డ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సహకారంతో బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్ ఫర్ ఉమెన్ వేదికగా గ్లో ఫ్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఖలీలుర్ రెహమాన్, సోఫియా హసీబ్ హాజరయ్యారు. ఇందులో భాగంగా కిరణ్ డెంబ్లా, ఆర్జే షాదాబ్ పీరియడ్స్‌ను అవమానపరిచే విభిన్న ఆలోచనను స్టాండ్ అప్ కామెడీగా ప్రదర్శించారు. అంత కాకుండా అంతర్జాతీయ ప్రఖ్యాత డీజే, ఫిట్‌నెస్ కోచ్ అయిన కిరణ్ డెంబ్లా స్ఫూర్తిదాయకమైన కథను అనేక మందికి అందించారు. ఈ వినూత్న కార్యక్రమంలో విద్యార్థుల మొదలు కార్యకర్తలు, ఇన్ఫ్లుయెన్సర్లు తదితర ప్రముఖులు కలిసి ఋతు ఆరోగ్యం పై స్క్రిప్ట్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో హనా రెహమాన్, అభిషేక్ కిరాక్ వంటి అనేక మంది సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు... లింగ పక్షపాతం లేకుండా పీరియడ్స్ గురించి మాట్లాడటం, మీకు ఇష్టమైన రీల్స్ చూడడం లాంటిదేనని నిరూపించారు.హోలిస్టిక్ చైల్డ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సీరియల్ వ్యవస్థాపకురాలు జాతీయ అధ్యక్షురాలు అనుపమ దాల్మియా, మార్మామ్ రెసొనేటింగ్ రెసిలెన్స్ వ్యవస్థాపకురాలు డాక్టర్ నబత్ లఖానీ కూడా ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలని బిఆర్ఎస్ వినతి

బండ్లగూడ కార్పొరేషన్ పరిధిలో నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ జల మండలి అధికారికి వినతిపత్రం ఇస్తున్న బిఆర్ఎస్ నేతలు

నార్సింగి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :

బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో నెలకొన్న నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బిఆర్ఎస్ అధ్యక్షులు రావులకోళ్ల నాగరాజు నేతృత్వంలో జల మండలి అధికారికి వినతిపత్రి ఇచ్చారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఎప్పుడూ నీటి కొరత ఏర్పడ లేదని, కాంగ్రెస్ హయాంలో వేసవి ప్రారంభంలోనే తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. ఇంకా శివరాత్రి కూడా రాలేదని, అప్పుడే బండ్లగూడ కార్పొరేషన్ పరిధిలోని మాధవీనగర్, పిజికాల నీల్లో నీటి ఎద్దడి ప్రారంభమైందన్నారు. ఇళ్లల్లో వేసుకున్న బోర్లు ఎండిపోయాయని, ప్రజలు వాటర్ ట్యాంకర్లను కొని వాడుకుంటున్నారని తెలిపారు. ఇటీవలనే హిమాయత్ సాగర్ జలాలను సరఫరా చేస్తామని నేతలు హడావుడి చేశారని, అటు కృష్ణా, గోదావరి,మంజీరా నీరు రావడం లేదని, ఇటు హిమాయత్ సాగర్ నీరు కూడా రావడం లేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ మిషన్ భగరీథతో ఇంటింటికి నల్లా కనెక్షన్ ద్వారా నీటిని సరఫరా చేసి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూశారన్నారు. ఇప్పుడు పది రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేస్తే ఎలా ప్రజలు బతుకుతారని నాగరాజు ప్రశ్నించారు. కాంగ్రెస్ వచ్చినప్పుడల్లా ప్రజల కష్టాలు వస్తాయని మరోమారు రుజువు అవుతుందన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులుగాని, పాలకులు గాని స్పందించి బండ్లగూడ కార్పొరేషన్‌లో కనీసం రెండు రోజులకు ఒకసారైనా నీటిని సరఫరా చేయాలని నాగరాజు డిమాండ్ చేశారు. వనితిపత్రం అందజేసిన వారిలో బిఆర్ఎస్ నాయకులు రాముడు యాదవ్, చంద్రారావ్ తదితరులు ఉన్నారు.

కుంభమేళా బాధిత కుటుంబాన్ని పరమార్శించిన ఎంపి ఈటల



తార్నాకలో రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాన్ని పరమార్శిస్తున్న ఎంపి.ఈటల

తార్నాక, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: తార్నాక నుంచి కుంభమేళాకు వెళ్లి తిరుగు ప్రయాణంలో మృతి చెందిన తార్నాక బాధిత కుటుంబాన్ని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ పరమార్శించి కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి హామినిచ్చారు. తార్నాక ఉమా సిగ్నేచర్ అపార్ట్మెంట్స్‌లో నివాసముండే బ్యాంక్ ఆఫ్ బరోడా ఉద్యోగి టి.వి ప్రసాద్ ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే ఆయన కుటుంబ సభ్యులతో పాటు నాచారంలో కూడా బాధిత కుటుంబాలను ఆయన పరమార్శించారు. ఇటల వెంట బిజెపి జిల్లా కార్యదర్శి మల్లికంటి వీరన్న, స్టేట్ కౌన్సిల్ మెంబర్ బిజెపి సీనియర్ నాయకులు, పోచయ్య యాదవ్, బీజేపీ స్టేట్ రజక సెల్ నాయకులు కొన్నె సంపత్, సుక్క గణేష్ ముదిరాజ్, తార్నాక డివిజన్ ప్రెసిడెంట్ ఉపేందర్ యాదవ్, సుక్క గణేష్ ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు.

నిజాం కళాశాలలో సైనికులకు ఘనంగా నివాళి

పుల్వామా దాడిలో ప్రాణాలను కోల్పోయిన సైనికులకు నిజాం కళాశాలలో నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపల్.

సైఫాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:

పుల్వామా దాడిలో ప్రాణాలను కోల్పోయిన సైనికులకు శుక్రవారం నిజాం కళాశాలలో ఘనంగా నివాళి కార్యక్రమం జరిగింది. సరిగ్గా ఐదు సంవత్సరాల (2019) క్రితం ఒక ఆత్మహత్యా బాంబర్ జమ్ము-శ్రీనగర్ నేషనల్ హైవేపై 2,500లకు పైగా సైనికులతో కూడిన 78 వాహనాల కాన్వాయిని లక్ష్యంగా పెట్టారు. ఇందులో 40 సిఆర్‌పిఎఫ్ ఉద్యోగులు ప్రాణాలను కోల్పోయారు. చాలా మంది గాయాలకు గురైనారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రాంగణంలో కళాశాల ప్రిన్సిపల్ ఎ.వి.రాజశేఖర్ మాట్లాడుతూ మన సైనికుల వీరత్వానికి, వారు మనదేశాన్ని రక్షించేందుకు, దేశ ప్రజలను కాపాడేందుకు నిరంతరం పోరాడుతున్నారని కొనియాడారు. వారి అంకితాభావం, దేశానికి ఉన్న నిబద్ధత మనందరికి ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్-ప్రిన్సిపల్ డా.రేణుక, ఎన్‌సిసి ఆఫీసర్ డా. వి.నవీన్‌రెడ్డి, డా.శ్రీనివాస్, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి విద్యార్థులు దేశభక్తి గీతాలను అలపించి దేశభక్తిని చాటారు.

సేవలాల్ మహారాజ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి : ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

తార్నాక, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: గిరిజన శక్తి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి సందర్భంగా 2కె రన్ కార్యక్రమం ఒ..యూ ఎన్‌సీసీ గేట్ నుండి ఆర్ట్స్ కళాశాల వరకు ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్ర నాయక్, మాజీ మంత్రివర్యులు రవీందర్ నాయక్ అమర్ సింగ్ తిలావత్,అతిథులుగా స్టేట్ టాక్స్ జాయింట్ కమిషనర్ అమర్ నాయక్, డిప్యూటీ కమిషనర్ భీమ్లా నాయక్, హెచ్పీసీఎల్ మేనేజర్ మంగీలాల్ నాయక్, డిఈ బాలాజీ రాథోడ్, కార్పొరేటర్ సుమన్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విప్ డా.రాంచంద్రునాయక్ మాట్లాడుతూ సేవలాల్ మహారాజ్ జీవితం సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరి గురించి మంచి విషయాలను చెప్పారని ఆయన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని ఆయన జీవితాంతం బంజారాల అభివృద్ధికై త్యాగం చేశారని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సమాజంలో అందరూ బాగుండాలని కోరుకున్నారని తెలిపారు. అనంతరం మాజీ మంత్రి రవీందర్ నాయక్, అమర్ సింగ్ తిలవత్ మాట్లాడుతూ సేవలాల్ మహారాజ్ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని,జాతీ ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ నడుంబిగించి ముందుకు సాగాలని కోరారు. గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు

మట్లాడుతున్న ప్రభుత్వ విప్ డా.రాంచంద్రునాయక్,

శరత్ నాయక్ మాట్లాడుతూ సేవలాల్ మహారాజ్ గారి జీవిత చరిత్రను అన్ని వర్గాల విద్యార్థులు ప్రజలు చదివి మంచి విషయాలను గ్రహించి వారి జీవితంలో వాటిని పాటించి ప్రతి ఒక్కరు గొప్పగా జీవించాలని కోరారు. అతిథులు 2కె రన్ లో విజేతలుగా నిలిచిన వారికి మెడల్ తో సత్కరించి,నగదు బహుమతిని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దాదాపు 500 పైగా విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో గిరిజన శక్తి వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బు నాయక్,ప్రధాన కార్యదర్శి విజయ నాయక్,రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ రమేష్ రాథోడ్, రాష్ట్ర కోఆర్డినేటర్ నందు నాయక్,పిడి ప్రకాష్ రాథోడ్, రెజ్లింగ్ కోచ్ జైపాల్ నాయక్, ఓయు అధ్యక్షులు హనుమంతు నాయక్, సతీష్ నాయక్, ప్రవీణ్ నాయక్, నరేందర్ నాయక్, హరి నాయిక్, రాజశేఖర్ నాయక్ పాల్గొన్నారు.

తునికాకు సేకరణకు టెండర్లు వేయాలని ఆందోళన

-17న జిల్లా మండల కేంద్రాలలో రౌండ్ టేబుల్ సమావేశాలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: ఈనెల 17న అన్ని జిల్లా కలెక్టర్ ఐటిడిఏ డిఎఫ్ అధికారులకు తునికాకు సేకరణకు టెండర్లు నిర్వహించాలని కోరుతూ వినతిపత్రాలు ఇవ్వాలని, అన్ని మండల కేంద్రాలలో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య అధ్యక్షతన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది దీనికి ముఖ్య వక్తగా హాజరైన అఖిల భారత కిసాన్ సభ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే బీడీ, ఆకు సేకరణకు ఆదేశాలు ఇవ్వాలని, తునికాకు ప్రూనింగ్ పనులు వెంటనే చేపట్టి ఏజెన్సీ జిల్లాల్లో ఉన్న తునికాకు కార్మికులకు జీవనోపాధి కల్పించాలని, పెండింగ్ లో ఉన్న బోనస్ డబ్బులు చెల్లించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో 14 ఏజెన్సీ జిల్లాల్లో 196 యూనిట్ల పరిదిలో నాలుగు లక్షల అరవై వేల మంది గిరిజనులు, గిరిజనేతర ప్రజలు రెండవ పంటగా తునికాకు సేకరణ చేస్తూ జీవిస్తున్నారు. తునికాకు సేకరణ ద్వారా ప్రతి కుటుంబం 2050 వేల రూపాయల చొప్పున సుమారు 400 కోట్ల రూపాయల వరకు జీవన భృతి పొందుతున్నారు, ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెలలో తునికాకు ప్రూనింగ్ పనులు నిర్వహిస్తారు, కావున వెంటనే టెండర్లు పిలిచి ప్రూనింగ్ పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము, అదేవిధంగా 2021 సం.. నుంచి 2024 సం.. వరకు నాలుగు సంవత్సరాల తునికాకు కార్మికులకు చెల్లించవలసిన బోనస్ డబ్బులు

ప్రసంగిస్తున్న అఖిల భారత కిసాన్ సభ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి

సుమారు 18కోట్ల రూపాయలు పెండి శీ గ్ లో ఉన్నాయి, కావున పెండింగ్లో ఉన్న తునికాకు కార్మికులకు బోనస్ డబ్బులు చెల్లించాలని, తునికాకు కార్మికులకు మొలిక సదుపాయాలు, బీమా సౌకర్యం కల్పించాలని, కట్టరేటు 6 రూపాయలు, ఉల్టా, పల్టా, లోడి శీ గ్ ధరలు పెంచాలని కోరారు. ఈ సమావేశంలో తీర్మానాన్ని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ వెంకట్ రాములు ప్రవేశపెట్టారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ సాగర్, సివిటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపా ల్ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ధర్మ, శ్రీరామ్ నాయక్, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్టెలాబ్ బాబు ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, డివైఎఫ్ ఐ రాష్ట్ర అధ్యక్షులు కోటా రమేష్, నగర కార్యదర్శి జావిద్ తీర్మానాన్ని బలపరుస్తూ మాట్లాడారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్, బి పద్మ, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్ నాయక్, సివిటియు రాష్ట్ర నాయకులు సోమన్న తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ కార్మికులు, పేదలకు మేలు చేకూర్చేలా లేదు

-ఆర్థిక విశ్లేషకులు డి. పాపారావు

చిక్కడపల్లి ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా ఉందే తప్పా కార్మికులకు, పేదలకు మేలు చేకూర్చేదిగా లేదని ఆర్థిక విశ్లేషకులు డి. పాపారావు వ్యాఖ్యానించారు. శుక్రవారం సాయంత్రం సివిటియు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అధ్యక్షతన "కేంద్ర బడ్జెట్ కార్మికవర్గంపై ప్రభావం అనే అంశం"పై సెమినార్ జరిగింది. ఈ సెమినార్‌కు ముఖ్యఅతిథులుగా ఆర్థిక విశ్లేషకులు డి. పాపారావు, ఆర్థికసామాజిక విశ్లేషకులు డి. నర్సింహారెడ్డి, ఉపన్యాసకులుగా సివిటియు సీనియర్ ఉపాధ్యక్షులు ఎస్. వీరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్లు ప్రసంగించారు. డి పాపారావు మాట్లాడుతూ ఈ బడ్జెట్ వర్గ పోరాటంలో ఒక భాగం. సంస్కరణల తర్వాత సంక్షేమ రాజ్యాలు కూలిపోయాయని, దాని తర్వాత ప్రభుత్వాలు ధనిక దేశాలకు, ధనిక వర్గానికి సాగిలపడటం పెరిగిందని, దీంతో కార్పొరేట్లకు లాభాలు పెరగడం మొదలయ్యాయన్నారు. దీంతో కార్మికుల నిజవేతనాలు తగ్గిపోవడం, సంక్షేమ పథకాలు, విధానాలపై కోతలు, ఫలితంగా ఈ ప్రభావం కాస్తా ప్రస్తుత కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో కూడా కనబడుతుందన్నారు. పేదలకు ఉపయోగపడే ఫెర్టిలైజర్లు, ఆహార పదార్థాలు, ఇంధనం మీద సబ్సిడీ తగ్గించారని, కార్పొరేట్ల సంపదపై ఆదాయ పన్ను తగ్గించి వేస్తున్నారన్నారు. జిఎస్టి రూపంలో పరోక్ష పన్ను పెంచి సామాన్య ప్రజల నుండే వసూలు చేస్తున్నారు. అనేక రకాలుగా మధ్యతరగతి ఉద్యోగులు ఎదుర్కొంటున్న వ్యక్తిగత పన్ను రాయితీని బిజెపి ప్రభుత్వం మొట్టమొదటిసారిగా రాయితీ ప్రకటించిందన్నారు. ఇది కొంతమేరకు ఊరట కల్గించే అంశమేనైనా దీని వెనుక కూడా ప్రభుత్వ వ్యూహం అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గుకురావడం కోసం కార్పొరేట్ల టాక్సు భారీగా

ప్రసంగిస్తున్న ఆర్థిక విశ్లేషకులు డి. పాపారావు

తగ్గించారన్నారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రభుత్వాలు అనేక రాయితీలు కల్పిస్తున్నాయి. విదేశీ పెట్టుబడులతో పాటు వారి విధానాలు, ఆలోచనలు కూడా మన దేశానికి తీసుకువస్తున్నారు. కృత్రిమ మేధ (ఏఐ) కూడా ఇందులో భాగమే. దేశ ఉత్పాదకతకు కార్మికవర్గం ప్రధాన కారణం, కానీ వారి కోసం ప్రత్యేక కేటాయింపులు లేవు. డైలీవేజ్ లేబర్, క్యాజువల్ లేబర్ మొదలైన వాళ్ళు లేకపోతే కీ దేశ జిడిపిలో వృద్ధి శాతం తగ్గిపోతుందన్నారు. సివిటియు సీనియర్ ఉపాధ్యక్షులు ఎస్. వీరయ్య మాట్లాడుతూ బడ్జెట్ కార్మికులకు ఉన్న సంబంధం పన్నుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వం కార్మికుల వేతనాలు పెంచడానికి, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించడానికి, ఉపాధి కల్పించడానికి ఖర్చు పెట్టాలి. గత 5 సంజలలో నిజవేతనాలు పడిపోయాయి. కొనుగోలు శక్తి తగ్గిపోవడంతో సరుకులు మార్కెట్ తగ్గిపోతున్నాయి. ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలుగా ఎంఎస్ఐఎస్లను ప్రోత్సహించాలి. విత్తనాలు, ఎరువులు సబ్సిడీ ధరలకు అందించాలి. వంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలి. కానీ ప్రభుత్వం ఈ చర్యలేవీ చేపట్టడం లేదు. విద్య, వైద్య దేనిని పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లను, ప్రభుత్వ అనుపత్రుల్లో వైద్యులను, తగిన సిబ్బందిని, మొలిక సదుపాయాలు కల్పించడం లేదు. ఈ ఖర్చులన్నీ పెరగడంతో ప్రజలు అప్పులపాలౌతున్నారు. పాలడుగు భాస్కర్ సివిటియు రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ భూపాల్, జె. వెంకటేష్, ఎస్వీ, రమ, వంగూరు రామలు, పద్మశ్రీ, కూరపాటి రమేష్, కె. ఈశ్వర్రావు, జై. చంద్రశేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి బిర్యానీ హౌస్ వద్ద ఘర్షణ

-సెల్‌ఫోన్ విషయంలో చెలరేగిన గొడవ..అన్నదమ్ములపై మూకుమ్మడి దాడి
-బాధితులు, హోటల్ సిబ్బంది పరస్పర ఫిర్యాదులు
-కౌంటర్ కేసులు నమోదు చేసిన మీర్‌పేట్ పోలీసులు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: హైదరాబాద్ నగర శివార్లలోని రాచకొండ పోలీస్ కమీషనరేట్ కిందకు వచ్చే మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి ఓ బిర్యాని హోటల్ ముందు ఘర్షణ జరిగింది. దాడుల నేపథ్యంలో అర్ధరాత్రి సమయంలో హోటల్ వద్ద ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తి కలకలం రేపాయి. హోటల్ పరిసరాల్లో ఉన్న ఓ కాలనీకి చెందిన ఇద్దరు అన్నదమ్ములకు హోటల్ సిబ్బందికి మధ్య వివాదం చెలరేగి దాడులకు దారి తీసింది. హోటల్‌కు సంబంధించిన సిబ్బంది మూకుమ్మడిగా దాడి చేయడంతో అన్నదమ్ముల్లో ఒకరు పారిపోగా దొరికిన ఒకరిని కర్రలతో చితకబాదారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా హోటల్‌కు చెందిన ఓ వ్యక్తి సదరు అన్నదమ్ములు తోటి సిబ్బందిలో ఒకరిపై చేయిచేసుకొని దర్భాషలాడారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కౌంటర్ కేసులను నమోదు చేశారు. మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ ఏరియాలో బహిరంగంగా నడి రోడ్డుపై అర్ధరాత్రి దాటిన సమయంలో అరుపులు, కేకలతో హంగామా, న్యూసెన్స్, కలకలం, భయోత్పాతం కలిగించిన ఈ ఉదంతానికి సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. బిఎన్‌రెడ్డినగర్ సమీపంలోని పంచాయతీరాజ్ కాలనీకి చెందిన సేల్స్ మేనేజర్‌గా పని చేసే సిద్ధాంతి వీరేష్ విధులు ముగించు కొని బిఎన్‌రెడ్డినగర్ ప్రధాన రోడ్డు మీదుగా ఇంటికి నడుకు కుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో మెయిన్ రోడ్డులో నున్న దావత్ బిరియానీ హౌస్‌లో పని చేసే ఒక వ్యక్తి సెల్ ఫోన్ మాట్లాడుతూ నేలకేసి కొట్టాడు. దీంతో అక్కడి నుండే నడుచుకుంటూ వెళ్తున్న వీరేష్ స్పందించి తనకు తగిలేది కదా అంటూ ప్రశ్నించాడు. అంతలోనే వీరేష్ అన్న సిద్ధాంతి గౌరీ శంకర్ కూడా అక్కడికి వచ్చి విషయం తెలుసుకొని తమ్ముునితో కలిసి నిలదీశాడు. దీంతో అక్కడ అలజడి చెలరేగంతో హోటల్‌లో నుండి కొందరు పని చేసే వారు బయటకు వచ్చి అన్నదమ్ములతో గొడవపడ్డారు. అనంతరం వారంతా కలిసి మూకుమ్మడిగా దాడులకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో భయపడిన వీరేష్ అక్కడి నుండి పారిపోగా హోటల్ పనివారు గౌరీ శంకర్‌ను పట్టుకొని చితకబాదడమే కాకుండా కర్రలతో దాడి చేశారు. ఈ మేరకు వీరేష్ మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హోటల్ మేనేజర్ ప్రోద్బలంతో సిబ్బంది తమపై దాడులకు తెగబడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే హోటల్‌లో పని చేసే నవీన్‌కుమార్ అనే వ్యక్తి తమతో పాటు పని చేసే ఫోన్ మాట్లాడుతున్న అభిషేక్ దాస్‌ను వీరేష్, గౌరీ శంకర్‌లు దుర్భాషలాడి కొట్టారని ఫిర్యాదు చేశాడు. దీంతో ఇరువర్గాల ఫిర్యాదులను తీసుకున్న మీర్‌పేట్ పోలీసులు కౌంటర్ కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గొడవలు, దాడులు, ఫిర్యాదుల నేపథ్యంలో మీర్‌పేట్ ఇన్స్ పెక్టర్ స్పందిస్తూ వీరేష్, గౌరీ శంకర్‌లు దావత్ బిర్యానీ హౌస్ కస్లమర్లు కాదని వెల్లడించారు.

తెలుగు సాహిత్య తిలకధారి ఆచార్య సంపత్ కుమారాచార్య : డా. కె.వి.రమణాచారి

నాంపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : మూడు తెలుగు సాహితీ ప్రక్రియలు తిలంకారశాస్త్రం, చందస్సొశాస్త్రం, వచన పద్యంలను త్రితిలకాలుగా నుదిటిన ధరించిన అచ్చమైన స్వచ్ఛమైన సాహితీ శ్రీవైష్ణవుడు ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య అని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అభివర్ణించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విస్తరణ సేవావిభాగం ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు సభాధ్యక్షతన నిర్వహించిన ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య 12వ స్మారకోపన్యాసం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డా. కె.వి.రమణాచారి ఆత్మీయ అతిథులు డి.లక్ష్మణాచార్యులు, రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు, విస్తరణ సేవా విభాగం ఇన్‌చార్జ్ రింగు రామమూర్తి తదితరులతో కలిపి ఆచార్య కోవెల చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి జ్యోతిప్రకాసనంచేసి మాట్లాడారు. కోవెల తెలుగు సాహితీరంగంలో

ఆచార్య కోవెలకు పుష్పాంజలితో నివాళులర్పిస్తున్న రమణాచారి, నిత్యానందరావు, హనుమంతరావు, మనోహరబాబు తదితర అతిథులు

సంపత్ సాహితీజ్యోతిగా వెలుగొందుతూ తనదైన ప్రత్యేక ముద్రవేసుకున్నారని, చేతనావర్తన కవులలో నిత్యచేతన కవిగా నిలిచారని కొనియాడారు. కోవెల ప్రసంగాలు, వ్యాసాలు, పద్యాలు, వ్యాఖ్యలు పూర్తి వ్యాకరణబద్ధంగా ఉంటాయని తెలిపారు. సంపత్కుమారాచార్య పద్యవిద్యా వైభవం అనే అంశంపై ప్రముఖ రచయిత గన్నమరాజు గిరిజా మనోహరబాబు ప్రసంగించారు. రింగు రామమూర్తి సమన్వయకర్తగా వ్యవహరించారు.

ఏప్రిల్‌లో భారతీయ ప్రైవేట్ ట్రాన్స్ పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ జాతీయ మహాసభలు

ప్రసంగిస్తున్న భారతీయ ప్రైవేట్ ట్రాన్స్ పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:

ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో హైదరాబాబాద్ నగరంలో భారతీయ ప్రైవేట్ ట్రాన్స్ పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ జాతీయ మహాసభలు నిర్వహించబోతున్నట్లు భారతీయ ప్రైవేట్ ట్రాన్స్ పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి అన్నారు. ఈ సమావేశంలో దేశ వ్యాప్తంగా ప్రైవేట్ రవాణా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పై చర్చించడం జరుగుతుందన్నారు. ఇందులో ప్రధానంగా దేశంలోని అన్ని రాష్ట్రాలలో రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, 20 లక్షల ప్రమాద భీమ, డ్రైవర్ల కుటుంబాలకు వైద్య సౌకర్యం, పిల్లలకు ఉచిత విద్య, వాహనాల ఇన్స్యూరెన్స్ 50 శాతం తగ్గించాలని , జాతీయ రహదారులపై విశ్రాంతి గృహాలు, వైద్య సౌకర్యం, సబ్సిడీ క్యాంటీన్ల నిర్వహణ అమలు విషయాలలో తీర్మానాలు చేయడం వంటి అంశాలుంటాయన్నారు. శుక్రవారం కోలకత్తా లో ట్యాక్సీ యూనియన్ ఆఫీస్ బేరర్స్ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఆయా అంశాలను ప్రస్తావించడం జరిగిందని, ఏప్రిల్ నెలలో హైదరాబాద్‌లో జరిగే మహాసభల్లో అక్రమ బైకుల నిషే ధం , రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు, డ్రైవర్లకు ప్రమాద భీమా, వాహనాల ఇన్స్యూరెన్స్ తగ్గింపు వంటి అంశాలుంటాయన్నారు.

మీ సేవ కేంద్రాల పై చర్యలు తీసుకోవాలి

-డి.వై.ఎఫ్.ఐ జిల్లా కమిటీ కార్యదర్శి ఎండి.జావీద్

అదనపు కలెక్టర్ ముకుందరెడ్డికి వినతిపత్రాన్ని అందిస్తున్న డి.వై.ఎఫ్.ఐ జిల్లా కమిటీ కార్యదర్శి ఎండి.జావీద్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:

నూతన రేషన్ కార్డుల దరఖాస్తు అధిక డబ్బులు వసులు చేస్తున్న మీ సేవ కేంద్రాల పై చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డి.వై.ఎఫ్.ఐ) హైదరాబాద్ జిల్లా కమిటీ కార్యదర్శి ఎండి.జావీద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ ముకుంద రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎం. డి జావీద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నూతన రేషన్ కార్డుల దరఖాస్తుల పై రూ.50 వసూలు చేయాలని నిర్ణయిస్తే మీ సేవ కేంద్రాలు మాత్రం రూ.100 నుండి రూ.1000 వర

కుంభమేళాలో పుణ్య స్నానాలు చేసిన ఎమ్మెల్యేలు

కుంభమేళాలో పుణ్య స్నానాలు చేసిన ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులు

కంటోన్మెంట్,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో శు క్రవారం మాజీ మంత్రి, మేడ్చెల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిలతో పాటు వారి కుటుంబ సభ్యులతో కలిసి త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు చేశారు.

సిద్ధమైన రామాలయం రాజ గోపురం

ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న రాజ గోపురం

అల్వాల్, మార్చి 14 ప్రభాతవార్త:
ఓల్డ్‌అల్వాల్‌లోని చారిత్రాత్మకమైన రామాలయం రాజగోపురం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. దశాబ్దాలు చరిత్ర కలిగిన రామాయం రాజగోపురం కొంత వరకు శిధిలావస్థకు చేరుకోవడం తో స్థానిక పుర ప్రముఖులు దాతలు సహకారంతో గోపురం పున నిర్మాణం చేయడం జరిగింది. మహా శివరాత్రి పర్వ దినం రోజున చిన జీయర్ స్వామి రాజ గోపురాన్ని ప్రారంభినున్నారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి : కార్పొరేటర్

రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

అల్వాల్, మార్చి 14 ప్రభాతవార్త:
అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగానిదే అని అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని ఓల్డ్‌అల్వాల్ పోచమ్మ ఆలయం వద్ద నిర్మాణంలో ఉన్న రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తి చేయాలని శాంతి శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో లింగారెడ్డి, సాజిత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ అభిమాని రుషీకేశ్వర్ రావు మరణం విచారకరం

-టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా

ముషీరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త: ఎన్టీఆర్ అభిమాని గజ్జల రుషీకేశ్వర్‌రావు మరణం విచారకరమని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు, ఎన్టీఆర్ అభిమాన సంఘాల సమాఖ్య అధ్యక్షులు, మాజీ వికలాంగుల చైర్మన్ పి.సాయిబాబా అన్నారు. శుక్రవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుషీకేశ్వర్‌రావు మరణం ఎన్టీఆర్ అభిమానులకు తీరని లోటని, ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నామన్నారు. రుషీకేశ్వర్ ఎన్టీఆర్ అభిమానిగా ఎన్నో విశిష్టమైన కార్యక్రమాలు చేపట్టి, అభిమానులందరికీ మార్గదర్శకంగా నిలిచారని గుర్తు చేశారు. రుషీకేశ్వర్ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ నేతలు బాలరాజ్‌గౌడ్, ఎం.ఎస్.చంద్ర, సానాకుల ప్రకాష్, ఎన్.వి.ఆప్పారావు పాల్గొన్నారు.

కెసిఆర్ జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు : తలసాని

బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

కంటోన్మెంట్,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కేసిఆర్ జన్మదిన వేడుకలను ఈ నెల 17వ తేదీన బారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సనత్ నగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన కేసిఆర్ జన్మదిన వేడుకలను ప్రతి యేటా నిర్వహించిన మాదిరిగానే తెలంగాణ భవన్‌లో జరుగుతా యన్నారు. ఈ ఎసందర్భంగా ఆయా డివిజన్లలో కేక్ కటింగ్, పండ్ల పంపిణీ,ప్రత్యేక పూజలు,ప్రార్థనలు ఘనంగా జరగాల న్నారు. తెలంగాణ భవన్‌లో జరిగే ఈ వేడుకలకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీఆర్,మాజీ మంత్రి హరిశ్‌రావ్‌లతో ఎంపీలు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, కార్పోరేటర్లు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొ రేటర్లు కొలను లక్ష్మి, మహేశ్వరీ, బిఆర్ఎస్ నాయకులు గుర్రం పవన్‌కుమార్ గౌడ్,అత్తేల్లి శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరికృష్ణ, వెంకటేషన్ రాజు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యానికి ఎల్.ఓ.సీ. . ..

మెరుగైన వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తలసాని తెలిపారు. బల్కంపేటకు చెందిన రాజేశ్వరికి మెరుగైన వైద్యం కోసం సిఎం.ఆర్.ఎఫ్.నుంచి మంజూ రైన 2.75 లక్షల ఎల్.ఓ.సీ.పత్రాన్ని ఎమ్మెల్యే తలసాని చేతుల మీదుగా అందజేశారు.

నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిజాంపేట్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త

33కేవీ బాచుపల్లి ఫీడర్‌లో నేడు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీ హోమ్స్, బ్లూక్ డైమండ్ కాలనీ, కెఆర్‌సిఆర్ కాలనీ, క్రాంతినగర్, సాయినగర్, ఆర్‌జేకె ప్రాంతాలు, అలాగే నిజాంపేట్ సబ్ స్టేషన్ పరిధిలో 12గంటల నుండి 3 గంటల వరకు 11కేవీ నిజాంపేట్ ఫీడర్, 11కేవీ శ్రీనివాస కాలనీ ఫీడర్, 11కేవీ జర్నలిస్ట్ కాలనీ ఫీడర్‌లలోని బాలాజీ వెస్ట్‌కౌంటీ, శ్రీనివాస హౌసింగ్ సొసైటీ, బాలాజీ కాలనీ, ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 3, కెటిఆర్ కాలనీ, శ్రీనివాస కాలనీ, బాలాజీ కాలనీ, అఖిల అబోడే, బాలాజీ మెడోస్, బండారి లేఅవుట్ రోడ్ నెంబర్ 4సి నుండి 9సి, జర్నలిస్ట్ కాలనీ ప్రాంతాలతో పాటు 11కేవీ రాజధాని ఫీడర్‌లో మధ్యాహ్నం 2:30 గంటల నుండి 3 గంటల వరకు జీపీ రోడ్, రెడ్డి అవెన్యూ, ఆదిత్య లాగూన్, శ్రీ బాలాజీ టవర్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో కోరారు.

విఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని 17న భారీ బహిరంగ సభ : ఆర్.కృష్ణయ్య

విఆర్ఏల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో నీల వెంకటేష్, ఆంజనేయులు తదితరులు

సైఫాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: జీవో నెంబరు 81 ప్రకారం 61 ఏళ్ళుపైబడిన విఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ నెల 17 'చలో హైదరాబాద్' పేరిట భారీగా ధర్నా నిర్వహిస్తున్నామని రాజ్య సభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈ ధర్నాలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విఆర్ఏలు, వారి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ నిరుద్యోగ జెఏసి ఛైర్మన్ నీల వెంకటేష్, విఆర్ఏల వారసుల జెఏసి అధ్యక్షుడు ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన విఆర్ఏల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 2020 సెప్టెంబరు 9న గత ప్రభుత్వం అసెంబ్లీలో విఆర్ఏలకు పేస్కేల్‌తోపాటు వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిందని, ఆ హామీలను అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా విఆర్ఏలు 80 రోజుల పాటు దీర్ఘకాలికంగా సమ్మె చేయడం జరిగింది, దీంతో గత ముఖ్యమంత్రి, రెవిన్యూ శాఖ మంత్రి, అధికారులతో కలిసి విఆర్ఏలతో చర్చలు జరిపారని, ఫలితంగా జీవో నెంబర్లు 81, 85ను విడుదల చేయడం జరిగిందని ఆయన వివరించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 20,555 విఆర్ఏలలో డిగ్రీ చదివిన వారిని జూనియర్ అసిస్టెంట్లుగా, ఇంటర్ చదవిన వారిని రికార్డ్ అసిస్టెంట్‌గా 10 తరగతిలోపు చదవినవారిని ఆఫీస్ సబార్డినేటర్స్, రెవిన్యూ శాఖతోపాటు వివిధ శాఖల్లో 16,758 మందిని సర్దుబాటు చేయడం జరిగిందన్నారు. మిగిలిన 3,797 మంది విఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా గత 15 నెలలుగా ప్రభుత్వం జాప్యం చేస్తున్నదని ఆయన ఆరోపించారు. ప్రసుత్తం 3,797 మంది రెవిన్యూ పనులు చేస్తున్నారని, వీరిలో 400 మంది నిరాశ నిస్పృహలతో మృతి చెందడం జరిగిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారికి న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈసమావేశంలో విఆర్ఏల జెఏసి ప్రతినిధులు స్వ రూప, శ్రీనివాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బిజెపి మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులుగా భరత్ గౌడ్ ప్రమాణ స్వీకారం

భరత్‌గౌడ్‌ను సత్కరిస్తున్న బిజెపి రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్ర శేఖర్ జీ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: బిజెపి మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన గుండగోని భరత్ గౌడ్ పదవి బాధ్యతలు స్వీకారోత్సవ కార్యక్రమం శనివారం సాయంత్రం 4 గంటలకు ముషీరాబాద్ లోని కసిష్ ఫంక్షన్ హాల్ లో జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుతగా చిక్కడపల్లి లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఆ తర్వాత సాయంత్రం 3గంటలకు ఆలయం నుంచి ద్విచక్రవాహన ర్యాలీ ప్రారంభమై అక్కడి చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్ రోడ్, గోల్కొండ ఎక్స్ రోడ్, అశోక్ నగర్ చౌరస్తా, ఇందిరాపార్క్ చౌరస్తా మీదుగా ఆర్టిసి క్రాస్ రోడ్, గోల్కొండ ఎక్స్ రోడ్, ముషీరాబాద్ చౌరస్తా, గాంధీ హాస్పిటల్ నుంచి కసిష్ ఫంక్షన్ హాల్‌కు చేరుకుంటుంది. అనంతరం జరిగే ప్రమాణస్వీకారం కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కేంద్రమంత్రి జి కిషన్ రెడ్డి, బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే లక్ష్మణ్, కేంద్రమంత్రి బండి సంజయ్, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ తదితరులు పాల్గొననున్నారు.

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో అనాథ పిల్లలకు సహాయం

అనాథ పిల్లలకు సహాయసహకారాన్ని అందిస్తున్న చిక్కడపల్లి బ్రహ్మ కుమారీస్ ప్రతినిధులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: చిక్కడపల్లి లోని బ్రహ్మ కుమారీస్ శాఖకు చెందిన సభ్యులు శుక్రవారం రామ్ కోఠి లోని నవ జీవన అనాథ ఆశ్రమాన్ని సందర్శించి అక్కడి అనాథ పిల్లలకు సహాయ సహకారాన్ని అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆశ్రమంలో ఉంటున్న పిల్లల అవసరాలను గుర్తించి నోట్ పుస్తకాలు, పెన్నులతో పాటు ఇతర ఆహారపదార్థాలను అందించారు. ముఖ్యఅతిథులుగా కేంద్రం ఇన్చార్జి జయశ్రీ పాల్గొని మాట్లాడుతూ ప్రేమికుల రోజు అని యువతీ యువకులు విద్యార్థులు పరస్పర ప్రేమ తెలుపుకొనేందుకు ఎంతో ధనం ఖర్చు చేస్తున్నారని, ఇందుకు బదులుగా అవసరమైన వారికి సహాయం చేస్తే మానసిక ప్రశాంతత ఆనందం కలుగుతుంది అని సూచించారు.

వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ఆదాయం రూ.2లక్షల37వేల660

చిక్కడపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం హుండి లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపు సందర్భంగా ఆలయానికి రూ.2లక్షల37వేల660 ఆదాయం లభించింది. ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ సుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం, ఇన్‌స్పెక్టర్ బి.సురేఖ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆలయం ప్రధాన అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ, కమిటీ సభ్యులు జి.పద్మావతి, నిర్మల, ముక్కా రామకృష్ణ, గండి హరీష్, సుబ్బారావు, ఎన్.శ్యామ్ మూదిరాజ్, సరళ నేతరాణి, ఎం.లక్ష్మినారాయణ, కంది సుబ్బారావు, అమర బాలకుమార్, దాసరి నవీన్ ప్రసాద్, శిశుకుమార్, కొత్తూరి వెంకట ప్రతాప్ కుమార్,లోకనాథ్,వెంటరావు, మురికి గణేష్, ఎం.బి.రామకోటేశ్వరరావు, ఓరుగంటిమోహన్‌రావు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ ప్రభుత్వం రద్దు చేయాలి



అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న మాలలు

సైఫాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అనేక మంది మాలలు శుక్రవారం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. మాల మహానాడు జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగం రాష్ట్ర కమిటీ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డా.వి.ఎల్.రాజు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ వడ్లమూరి కృష్ణస్వరూప్, వర్కింగ్ చైర్మన్ పబ్బతి శ్రీకృష్ణ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో మేజారిటిగా ఉన్న మాలలను ప్రభుత్వం తక్కువగా చూపించి వర్గీకరణ పేరుతో మాలలకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. మాల ఓట్లతో గద్దెనెక్కిన సిఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం మాలలకు తీరని అన్యాయం చేసిందని వారు ధ్వజమెత్తారు. వర్గీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో గళం ఎత్తాల్సిన మాల ప్రజా ప్రనినిధులు రేవంత్‌రెడ్డికి అమ్ముడుపోయి మాల జాతికి తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. తక్షణమే తమ పదవులకు రాజీనామా చేసి, మాల జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు జేఎన్ రావు, నక్కా దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

వీర సైనికులకు ఘన నివాళులు..

నివాళులు అర్పిస్తున్న బీజేపీ శ్రేణులు

నిజాంపేట్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త

నిజాంపేట బిజెపి అధ్యక్షులు భిక్షపతి యాదవ్ పుల్వామా ఉగ్రదాడిలో మరణించిన వీర సైనికులకి శుక్రవారం బిజెపి నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ఈరోజు ఒక చీకటి రోజు అని 2019కి పూర్వం ఫిబ్రవరి 14 అంటే ప్రేమికుల రోజు గాని ఎక్కువమంది గుర్తుంచుకునే వారని కానీ ఈ దాడి తర్వాత భారత సైనికులు అమరులైన రోజు బ్లాక్ డే గానే ప్రతి భారతీయుడు గుర్తుపెట్టుకుంటున్నారని అన్నారు. దీనిని భారత దేశంలోని ప్రతి యువతి యువకుడు ఈ విధంగానే జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాచుపల్లి అధ్యక్షులు ప్రసాద్ రాజు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి దాసి నాగరాజు, సచిన్, వెంకటేష్, రాజేష్, సిద్దు, వింగ్ కమాండర్ వైఎస్ ప్రసాద్, కిరణ్, జలపతి గౌడ్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారును కలిసిన జర్నలిస్టులు

నిజాంపేట్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త

జర్నలిస్టు కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బాచుపల్లి తహసిల్దార్ పూల్ సింగ్ ను జర్నలిస్టులు కలిసి నిజాంపేట జర్నలిస్ట్ కాలనీలో నివాసం ఉంటున్న స్థానికులకు సామాజిక అవసరాలకు స్థలాన్ని కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ 2007వ సంవత్సరంలో స్థానిక విలేకరులకు సర్వేనెంబర్ 334 నిజాంపేటలో అప్పటి ప్రభుత్వం లేఅవుట్ చేసి స్థలాలను ఇచ్చిందని తహసిల్దార్ కు వివరించారు. నాడు స్థలాలు ఇచ్చి ఇండ్లు నిర్మించుకోవడానికి అవకాశం కల్పించిన ప్రభుత్వం కాలనీ సామాజిక అవసరాలకు స్థలం కేటాయించలేదన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ కు విజ్ఞాపనలు పంపిస్తానని తగిన నిర్ణయం తీసుకుంటామని తాసిల్దార్ జర్నలిస్టులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట జర్నలిస్ట్ కాలనీ ఫౌండర్ అధ్యక్షుడు అస్కాని మారుతి సాగర్, అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాస్, ఎం దేవేందర్ గుప్తా, ఏ. గోవిందరావు, మేకల జీతయ్య, కోట కృష్ణారావు, కొమటి రమేష్, పితాని శ్రీనివాసరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బజరంగ్‌దళ్, విహెచ్‌పి, ఆర్ఎస్ఎస్ సంస్థలను ప్రభుత్వం నిషేధించాలి

సైఫాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:

ప్రేమికుల దినోత్సవాన్ని వ్యతిరేకించిన మతోన్మాద సంస్థలైన బజరంగ్‌దళ్, విహెచ్‌పి, ఆర్ఎస్ఎస్‌లపై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిషేదం విధించాలని ఆల్ ఇండియా దళిత, క్రైస్తవ సంఘాల సమాఖ్య జాతీయ కార్యదర్శి జెరుషాలెం మత్తయ్య డిమాండ్ చేశారు. ఆ సంస్థలు రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా, మానవ హక్కులకు విరుద్ధంగా హిందూ మతోన్మాదులు చేస్తున్న దుశ్చర్య, ముఖ్యంగా ప్రేమికులైన యువతి యువకుల భావవ్యక్తీకరణ స్వేచ్ఛా రాజ్యంగ హక్కులకు వ్యతిరేకంగా ఈ వాలెంటైన్ డేను హిందూ సంఘాలు వ్యతిరేకించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుల రహిత సమసమాజ స్థాపన, కులమతాలకు అతీతంగా, సమాంతర కుటుంభ వ్యవస్థ, ఆదర్శ వివాహబంధంతో ప్రేమించకుని పెళ్ళిళ్లు చేసుకోవడం ద్వారా మానవులంతా ఒక్కటే అనే భావన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క ప్రేమికునిపైన ఉందన్నారు. ప్రేమికుల దినోత్సవం నాడు బజరంగ్‌దళ్, విహెచ్‌పి, ఆర్ఎస్ఎస్ సంస్థలకు భయపడి ప్రభుత్వం పార్కులను మూసివేయడం సిగ్గు చేటని ఆయన విమర్శించారు. ప్రేమను ప్రేమించు, ప్రేమికులను ఆదరించు అని రోమన్ కేథలిక్ చర్చి ఫాదర్ సెయింట్ వాలెంటెన్ చెప్పినందుకే, ఆ పేరు ఉన్నందుకే కేవలం క్రైస్తవులపై, క్రైస్తవ మతం పైన వ్యతిరేకతతో ఈ ప్రేమికుల దినోత్సవ వేడుకలను ఆ సంస్థలన అడ్డుకోవడం దారుణమన్నారు. ఆ సంస్థలతోపాటు బిజెపికి సిఎం రేవంత్‌రెడ్డి భయపడుతున్నారని ఆరోపించారు.

కొలన్ శ్రీనివాస్ రెడ్డిని కలిసిన నూతన సంక్షేమ సంఘం సభ్యులు

శ్రీనివాస్ రెడ్డిని శాలువాతో సత్కరించిన సంక్షేమ సంఘం సభ్యులు

నిజాంపేట్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త

ఎన్టీఆర్ నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ సభ్యులు శుక్రవారం పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏనుగుల శ్రీకాంత్ రెడ్డి, 7వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏనుగుల మధుసూదన్ రెడ్డి, శ్రీహర్ష ఆమంచి, ఎన్టీఆర్ నగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీ అధ్యక్షుడు రెడ్డిపల్లి సుధాకర్, కమిటీ సభ్యులు బూసాల ఉదయ్ కుమార్, బైపునేని మోహన్, కాలప్ప, లక్ష్మీ దేవరాజు, కాలిమా, కోటేష్ యాదవ్, భాను ప్రసాద్, చారి తదితరులు పాల్గొన్నారు.

మార్చి 1న అమరుల సంస్మరణ దినోత్సవం సభ

సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

సైఫాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ ద్వారా మాదిగ అమర వీరుల ఆత్మలకు శాంతి చేకూరిందని, ఈ తరుణంలో అమరుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం అదుకోవాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పిఎస్) రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. అమరుల కుటుంబాలకు 50 లక్షల రూపాయలు చెల్లించాలని, ఒక ఇందిరమ్మ ఇల్లును కేటాయించాలని, కుటుంబంలో ఒకరిక ఉద్యోగం కల్పించాలని, అమర వీరుల స్థూపాన్ని నిర్మించాలని, ఒక ఏకరంలో మ్యూజియంను ఏర్పాటు ఆయన ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 1వ తేదీన ఇందిరాపార్కు వద్ద మాదిగ అమరుల సంస్మరణ దినోత్సవం సంర్భంగా సభను నిర్వహిస్తున్నామని, ఈ సభలో అన్ని రాజకీయ పార్టీల నేతలు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. అమరుల కుటుంబాలను మంద కృష్ణమాదిగ ఏనాడు పరామర్శించలేదని, ఆయన్ని మాదిగ జాతి క్షమించదన్నారు. అమరుల త్యాగాల ఫలితంగానే వర్గీకరణ సాధ్యమైందని అమరుల కుటుంబాలను అదుకున్నప్పుడే ఆ ఫలితాలకు, ఆ త్యాగాలకు గుర్తింపు ఉంటుందన్నారు. వర్గీకరణ ఉద్యమంలో అనేక మంది చాతిచారీలకు గురైనారని, క్షతగ్రాతులైనారని, అనేక మందిపై ఇంకా కేసులు కొనసాగుతున్నాయని, కేసులను ప్రభుత్వం ఎత్తివేయాలని, సురేందర్, మహేష్, దామోదర్ హైదరాబాద్‌లో ప్రాణాలు అర్పించారని, భారత్క, రాధక్క, శ్రీకాంత జిల్లాల్లో మృతి చెందారని ప్రాణాలను అర్పించా రని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మాదిగలకు ఒక్క రిజర్వేషన్‌లు తగ్గాయని కృష్ణమాదిగ తిరిగి ఉద్యమం చేయాల్సిన అవసరం లేదని, ఇప్పటికే 30 సంవత్సరాలు గడిచిందని, అవసరమైతే ఆ తరువాత ఆలోచించుకోవచ్చునని, ప్రభుత్వం తక్షణమే అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి అమలు చేయాలని ఆయన కోరారు. అమరుల సురేందర్ తల్లిదండ్రులు యాదయ్య, గంగమ్మ, మహేందర్ తల్లిదండ్రులు అంజయ్య మాట్లాడుతూ ఏనాడు కృష్ణమాదిగ తమ నివాసాలకు వచ్చి పరామర్శించలేదన్నారు. ప్రభుత్వం తమ కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను అధిరోహించడానికి ముందుకు రావాలి

-రాష్ట్ర ఉన్నత విద్యామండలి పూర్వ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి

ప్రసంగిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి పూర్వ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: విద్యార్థులకు ఎంచుకున్న లక్ష్యాలను అధిరోహించడానికి ముందుకు రావాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి పూర్వ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి అన్నారు. మారుతున్న కాలానుగుణంగా తెలుసుకుంటూ జీవితంలో స్థిరపడటానికి దృష్టిని కేంద్రీకరించాలన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థ ఆవరణలో ఎంటర్ ప్రీమియర్‌షిప్ ఆధ్వర్యంలో ఆహారోత్సవం , ఫుడ్ స్టాల్ ఫెస్టివల్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ లింబాద్రి హాజరై ప్రసంగించారు. మాట్లాడుతూ మారుతున్న సమాజపు ఆహారపు అలవాట్లు అనుగుణంగా విద్యార్థులు ఫుడ్‌కార్నివాల్ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థినీ విద్యార్థుల్లో వ్యాపారం నిర్వహించడంలో ఆలోచనా మెళకువలను అలవర్చుకోవడంతో పాటు మంచి ప్రోత్సాహక రంగంలో రంగమైన ఆహార రంగంలో మంచి అవకాశాలున్నాయన్నారు. సీసీ మాజీ అకాడమిక్ గైడెన్స్ ఆఫీసర్ చారి ఫుడ్ స్టాల్‌ను సందర్శించి వ్యవస్థాపక అభివృద్ధి గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వై విష్ణు ప్రియ. ఫుడ్ కార్నివల్ ఫాకల్టీ కోఆర్డినేటర్స్‌గా వ్యవహరించి. కార్యక్రమమును దిగ్విజయంగా ముగించారు. సుమారు 30 స్టాళ్ళను ఏర్పాటు చేసి దాదాపు 40కు పైగా ఫుడ్ హోటల్స్ ను విద్యార్థులు ప్రదర

రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వం కృషి

- జాయింట్ సెక్రటరీ రాజశేఖర్ రెడ్డి

మలక్ పేట్ మహబూబ్ మాన్షన్ మార్కెట్ లో వర్యటిస్తున్న జాయింట్ సెక్రెటరీ రాజశేఖర్ రెడ్డి, ఎన్ జి ఎస్ దామోదర్, గ్రేడ్1 కార్యదర్శి చిలుక నరసింహారెడ్డి తదితరులు

మలక్ పేట, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యాలయం జాయింట్ సెక్రెటరీ రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన వివిధ పంటలు ఒకేసారి మార్కెట్లోకి రావడం వలన కొంత ధరలలో తగ్గుదల సహజంగా ఉంటుందన్నారు. ధరలు స్థిరంగా ఉండడం కోసం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్కెటింగ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశాలను నిర్వహించి ధరలను మానిటరింగ్ చేసేందుకు రాష్ట్రంలో వివిధ మార్కెట్లో ప్రత్యేక అధికారులను పర్యవేక్షించడం కోసం ఆదేశించారు. ఇందులో భాగంగా మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్లో జాయింట్ సెక్రటరీ రాజశేఖర్ రెడ్డి పర్యటించారు. మార్కెట్ యార్డులో ఆయన పర్యటించి రైతులతో ధరల విషయం గురించి పరిశీలించి పలు సూచన చేశారు. మార్కెట్లకు పంట సరుకును తీసుకు వచ్చే ముందర ముందు రోజు ఉన్న ధరలను అధికారులను, కమిషన్ దారులను తెలుసుకుని మాత్ర మే మార్కెట్ కు సరుకును అమ్మకానికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎస్ దామోదర్ గ్రేడ్1 సెక్రటరీ చిలుక నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరులైన వీర జవాన్లకు ఘన నివాళి

పుల్వామా ఉగ్రవాదుల దాడిలో అమరులైన వీర జవాన్లకు నివాళులర్పిస్తున్న చౌకి రవికుమార్, బాబు శ్రీనివాస్ తదితరులు

మలక్ పేట, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:

ఓల్డ్ మలక్ పేట్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బుగుడాల విష్ణుదేవ్ ఆధ్వర్యంలో మలక్ పేట్ లో జరిగిన కార్యక్రమంలో పుల్వామా ఉగ్రవాదుల దాడిలో అమరులైన వీర జవాన్లకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు సమర్పించి క్యాండిల్స్ వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాబు శ్రీనివాస్, ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్, మలక్ పేట్ నియోజకవర్గం సేవాదళ్ అధ్యక్షులు ఆకుల రాజు, నాయకుడు చీపురు రాజు, రామకృష్ణ, చిన్న, సోనీ, రాజు, మేఘన తదితరులు పాల్గొన్నారు.

ట్రైబల్ టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరిస్తున్న మధుయాష్కీ గౌడ్,సుజాత నాయక్.

వనస్థలిపురం. ఫిబ్రవరి.14.ప్రభాతవార్త : ట్రైబల్ టీచర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలండర్ ను టి.పి.సి.సి. ప్రచారకమిటి చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ తన నివాసంలో హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ టీచర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శంకర్ నాయక్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ నాయక్,కన్వీనర్ రాధా భాయి, శుక్రనాయక్,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వాణి నగర్ వినాయక టెంపుల్ ఆలయానికి అభివృద్ధి కమిటీ ఏర్పాటు

మల్కాజిగిరి ఫిబ్రవరి.14, ప్రభాతవార్త

దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల ఉత్తర్వుల ఆదేశాల మేరకు వాణి నగర్ వినాయక దేవాలయం అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గం ను దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి కె మోహన్ రెడ్డి ఆలయ కార్యనిర్వహణ అధికారి వెంకన్న సమక్షంలో దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గా సిరిగిరి రాజు కమిటీ సభ్యులుగా పివీ సత్యనారాయణ, లక్ష్మీ వీరభద్రరావు, బలరాం, జన్నయ్య పెంటయ్య, చంద్ర శేఖర్, భాద్యతలు స్వీకరించారు ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ జివ్వి సతీష్ కుమార్ బి కే శ్రీనివాస్ గుండా నిరంజన్ జీడి సంపత్ గౌడ్, రాందాస్ సంతోష్ ముదిరాజ్, వైనాల ప్రవీణ్,రామచందర్,బాబు,కన్నె మల్ల నాగరాజు, పరమేశ్,శారదా, సత్యనారయణ,సనది శంకర్,ఫరీద్,శంకర్, ఇస్తారి,యాదగిరి,కుమార్,బాలరాజు యాదవ్,కుట్టి శ్రీను,కన్నా, సంజయ్, తదితరులు పాల్గొన్నారు .

బిఆర్ఎస్‌కి పూర్వ వైభవాన్ని తీసుకొద్దాం

-మాజీ కార్పొరేటర్లు బద్దం పరశురామ్ రెడ్డి, బద్దం పుష్పలత రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ కవిత

నేరేడ్ మెట్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త : టిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చారు. శుక్రవారం మల్కాజిగిరి నియోజకవర్గం వినాయక నగర్ డివిజన్ చెందిన మాజీ కార్పొరేటర్ బద్దం పుష్పలత రెడ్డి, ఉద్యమకారుడు సీనియర్ నేత బద్దం పరశురాం రెడ్డి నివాసానికి విచ్చేసి వారితో కొంతసేపు ముచ్చటించారు. పుష్పలత రెడ్డి చేసిన ఆతిధి మర్యాదలను స్వీకరించి, అనంతరం బి ఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సిన వివిధ పరిస్థితులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ నేత మాజీ కార్పొరేటర్ బద్దం పరశురాం రెడ్డి, కార్పొరేటర్ మురుగేష్ బి ఆర్ ఎస్ నాయకులు బి హేమంత్ రెడ్డి, బాలకృష్ణ గుప్తా, ఫరీద్, ప్రభాకర్ రెడ్డి, అరుణ్, పాషా, సంతోష్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : మల్ రెడ్డి రంగారెడ్డి



తుర్కయంజాల్ ఫిబ్రవరి 14 (ప్రభాతవార్త): రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు.టెస్కాబ్ వైస్ చైర్మన్ డిసిసిబి చైర్మన్ కొత్త కుర్మా సత్తయ్య అధ్యక్షతన నిర్వహించినారు. తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కోహెడ ఫ్రూట్ మార్కెట్ ఆవరణలో తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం ఎఫ్ఎస్ సిఎస్ వారు 3 కోట్ల 25 లక్షల వ్యయం తో నిర్మించిన 5000 మెట్రిక్ టన్నుల కెపాసిటీ గల రెండు గోదాములు,1500 మెట్రిక్ టన్నుల కెపాసిటీ గల కోల్డ్ స్టోరేజీ ని టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్త కుర్మా సత్తయ్య, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధు సూదన్ రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ... రైతుల సంక్షేమానికి రైతు సేవ సహకార సంఘాలు ఎంత గానో కృషి చేస్తున్నాయని అన్నారు. తుర్కయంజాల్ రైతు సేవ సహకార సంఘం 350 కోట్ల రూపాయల టర్నోవర్ తో రాష్ట్రంలోనే ముందంజలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు వంగేటి లక్ష్మారెడ్డి, సామ సంజీ వరెడ్డి, చాపల యాదగిరి, కొండ్రు స్వప్న శ్రీనివాస్, శీలం లక్ష్మమ్మ, జక్క కృష్ణారెడ్డి, భార్గవి, సత్యనారాయణ రెడ్డి, నర్సింగ్ రావు, సంఘం సెక్రటరీ వై. రాందాస్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కురుమ మంగమ్మ శివకుమార్, కడారి శ్రీలత, నాయకులు కోషిక ఐలయ్య, కందాల బలదే వరెడ్డి, సామా భీమిరెడ్డి, గుండ్లపల్లి ధనరాజ్ గౌడ్, ఎలిమి నేటి నరసింహారెడ్డి, పూజారి శంకరయ్య, పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే బలాల

ఆనంద్ నగర్ లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బలాల చిత్రంలో నారాయణరెడ్డి, నాగరాజుగౌడ్ తదితరులు

మలక్ పేట ,ఫిబ్రవరి 14, ప్రభాతవార్త : ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తున్నామని మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మలక్ పేట్ నియోజకవర్గం అక్బర్ బాగ్ డివిజన్ లోని ఆనంద్ నగర్ లో వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే బలాల పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా మంచినీటి సరఫరాలలో లో ప్రెషర్, డ్రైనేజీ సమస్య, విద్యుత్ సమస్యలు , వీధి దీపాలు వెలగకపోవడం తదితర సమస్యల గురించి స్థానిక సంక్షేమ సంఘం నాయకులు నారాయణరెడ్డి ఎమ్మెల్యే బలాల దృష్టికి తీసుకొచ్చారు .వెంటనే ఎమ్మెల్యే బలాల స్పందించి స్థానిక ప్రజలు పేర్కొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో ప్రతినిత్యం వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటిస్తూ స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో అక్బర్ బాగ్ డివిజన్ కార్పొరేటర్ మినా జుద్దీన్, నాయకులు నారాయణరెడ్డి, నాగరాజుగౌడ్, సుమంత్ గౌడ్ లతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఉప్పల్ శ్రీ మహంకాళి ఆలయ ట్రస్ట్ బోర్డు కమిటి ఎన్నిక



ఉప్పల్ శ్రీ మహంకాళి ఆలయం కమిటి ట్రస్టీ బోర్డు ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : ఉప్పల్ మహంకాళి ఆలయం ట్రస్ట్ బోర్డు కమిటి ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ కమిటిచే ప్రమాణ స్వీకారం చేయించారు. శ్రీ మహంకాళి ఆలయం కమిటి చైర్మన్‌గా తెల్కల మోహన్‌రెడ్డి, ధర్మకర్తలుగా మాశెట్టి రాఘవేంద్రకుమార్, మీనంపల్లి అండాలు, గుమిడెల్లి కృష్ణ, అలుగుల అనిల్‌కుమార్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఉప్పల్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉన్న మహంకాళి ఆలయం ఇటీవల దేవాదాయ,ధర్మాదాయశాఖ పరిధిలోకి వచ్చిందని తెలిపారు. ఆలయం అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని కోరారు. ఆలయంలో జరిగే ఉత్సవాలకు ఆలయ కమిటి నేతలు నిరంతరం కృషి చేయాలని కోరారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ కార్యనిర్వహణ అధికారి వీరేశం, ఇన్‌స్పెక్టర్ ప్రణీత్, స్థానిక నేతలు కందికంటి అశోక్ కుమార్‌గౌడ్, సల్ల రాజిరెడ్డి, బాకారం లక్ష్మణ్, బి.సుధాకర్ రెడ్డి,బజారు జగన్‌గౌడ్, బిక్కుమళ్ల అంజయ్యగుప్త, రఘుపతిరెడ్డి, రమేష్‌గుప్త, విపిన్ అగర్వాల్, ఈగ శంకర్, ఈగ అంజనేయులు, పి.నాగరాజు, లింగంపల్లి రామకృష్ణ, శామీర్‌పేట రాకేష్‌రెడ్డి, మీనంపల్లి శ్రీశైలం, తెల్కల రవీందర్‌రెడ్డి, పూజల ప్రభాకర్, బి.రఘునాద్‌రెడ్డి,ఆగంరెడ్డి, తుమ్మల దేవిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వర్కల మధన్‌గౌడ్, సల్ల ప్రభాకర్‌రెడ్డి,మీనంపల్లి చందర్‌గౌడ్, కృష్ణగౌడ్, గుమిడెల్లి నరసింహా, సోము బాలమణి, భాస్కర్‌రెడ్డి, తుమ్మల రాజేందర్‌రెడ్డి, భాస్కర్,మల్లేష్, అశోక్,నురేష్, జంగరామ్,పస్తం శ్రీరాములు, తూర్పాటి జంగయ్య, బాలరాజు, కిషోర్, పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ జాగృతి అధ్యక్షురాలు మిర్యాల పావనికి కల్వకుంట్ల కవిత పరామర్శ

మిర్యాల పావనిని పరామర్శిస్తున్న కల్వకుంట్ల కవిత

నరూర్‌నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న తెలంగాణ జాగృతి నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షురాలు మిర్యాల పావనిని గురువారం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రశాంతిహిల్స్ కాలనీలో ఎమ్మెల్యే, తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత పరామర్శించారు. ఈ మేరకు క్యాన్సర్ బాధితురాలికి, ఆమె కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పావని త్వరగా కోలుకోవాలని కవితా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు జమాల్‌పూర్ సునీతా బాలరాజ్, స్థానిక డివిజన్ మాజీ కార్పొరేటర్ దోమలపల్లి ధనలక్ష్మి రాజ్‌కుమార్, జాగృతి మహేశ్వరం నియోజకవర్గ నాయకురాలు లావణ్యగౌడ్, అర్చన సేనాపతి, నాయకులు శ్రీను నాయక్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రామిడి నర్సిరెడ్డి, రమణ, నవీన్, అవినాశ్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల నిధుల వివరాలు ఇవ్వండి

-దిశా సభ్యుడు ఆంబోజి శ్రీనివాస్



బడంగ్‌పేట్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ శ్యామ్‌సుందర్‌కు వినతి పత్రం ఇస్తున్న రంగారెడ్డి జిల్లా దిశా కమిటీ సభ్యుడు ఆంబోజి శ్రీనివాస్

నరూర్‌నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: బిజెపి సారథ్యంలోని ఎన్‌డిఎ పాలనలో కేంద్ర ప్రభుత్వం ద్వారా విడుదలైన నిధులతో కూడా రంగారెడ్డి జిల్లాలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు అభివృద్ధి చెందుతున్నాయని జిల్లా దిశా కమిటీ సభ్యుడు ఆంబోజి శ్రీనివాస్ స్పష్టం చేశారు. గడచిన 2018వ సంవత్సరం నుండి 2025వ సంవత్సరం జనవరి 31వ తేదీ వరకు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వివిధ పథకాల అమలు కోసం కేంద్ర నుండి వచ్చిన నిధులకు సంబంధించిన సమగ్ర వివరాలు అందజేయాలని కోరుతూ శ్రీనివాస్ గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో ఒక వినతి పత్రం సమర్పించారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, కార్పొరేషన్-1 పార్టీ అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి తదితరులతో కలిసి ఆయన కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ శ్యామ్‌సుందర్‌ను కలిసి ఒక వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటి వరకు పూర్తయిన పనుల వివరాలు, మిగిలిపోయిన పనులకు సంబంధించిన వివరాలను దిశా కమిటీకి అందజేయాలని కోరారు.

టిజిఎస్ ఆర్టీసి విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి, ముద్దగోని రామ్మోహన్‌గౌడ్

సైదాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముద్దగోని రామ్మోహన్‌గౌడ్‌లు శుక్రవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరంన మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ జనవరిలో జరిగిన టిజిఎస్ఆర్టీసి విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర మహాసభలో తాను ఇచ్చిన హామీ మేరకు వారి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు.తమ విజ్ఞప్తికి మంత్రి సానుకూలంగా స్పందించారని రాంరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ పన్యాల జైపాల్‌రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ముఖ్య సలహాదారుడు బి.వి.కోటయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్.బుచ్చిరెడ్డి, కార్యదర్శులు బి.రామచంద్రగౌడ్, బి.ఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మా అమెరికా పర్యటన పుస్తకం ఆవిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

నాచారం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: అవాకేర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, రచయిత డా. లక్కరాజు నిర్మల ఆధ్వర్యంలో "మా అమెరికా పర్యటన.. ఐదు నెలల ఐదు రోజులు... కవితలు వాస్తవికతలు..." అనే పుస్తకాన్ని గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి ఆవిష్కరించారు.అంతకు ముందు మొదట ఎమ్మెల్సీ ప్రొ.కొదండరాం మొదటి పుస్తకాన్ని ఆవిష్కరించి మొదటి ప్రతిని అందజేశారు. అదేవిదంగా డాక్టర్ లక్కరాజు నిర్మల డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి కి పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, ఎమ్మెల్సీ ప్రొ.కొదండరాం మాట్లాడుతూ ఈ పుస్తకం రచయిత యొక్క అనుభవాలను, ప్రయాణాన్ని, భావజాలాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. డా. లక్కరా జు నిర్మల ప్రతిభను ప్రశంసిస్తూ, ఈ పుస్తకం నుండి అందరికీ ప్రేరణ లభిస్తుందని అభిప్రాయపడ్డారు. రచయిత పుస్తకం ద్వారా వ్యక్తీకరించిన భావాలను హాజరైన వారం దరు ప్రశంసించారు. కార్యక్రమంలో అతిథులు విశ్రాం త ప్రొఫెసర్ బాగయ్య,కొండపల్లి నరసింహ రావు, పండి తులు సతీష్, శ్రీ రేణుకాపతి, శ్రీమతి రాజ్యం,ఒం ప్రకాష్ పాల్గొన్నారు.

వెంకటేశ్వర కాలనీలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

డ్రైనేజీ నిర్మాణపు పనులకు శంకుస్థాపన చేస్తున్న కాలనీ అధ్యక్షుడు పి.కృష్ణ.

వనస్థలిపురం. ఫిబ్రవరి.14.ప్రభాతవార్త : బి.యన్. రెడ్డి. నగర్ డివిజన్ లోని వెంకటేశ్వర కాలనీలో రోడ్ నెంబర్ 5 లో భూగర్భ డ్రైనేజీ పైపులైన్ల నిర్మాణానికి శుక్రవారం కాలనీ అధ్యక్షుడు పి.కృష్ణ కాలనీ పెద్దల తో కలిసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ కాలనీలో 100 అడుగుల మేర డ్రైనేజీ పనులు మిగిలిపోవడంతో విషయాన్ని బి.యన్.రెడ్డి. నగర్ డివిజన్ బి.ఆర్.ఎస్. అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి దృష్టికి కెళ్లగా ఆయన ఎల్.బి. నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తో మాట్లాడి నిధులు మంజూరు చేయించారన్నారు. డ్రైనేజీ నిర్మాణపు పనులకు సహకరించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి,అరవింద్ రెడ్డిలకు కాలనీ అధ్యక్షుడు కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ కార్యదర్శి లక్ష్మి చారి, కోశాధికారి బొమ్మరాజు శ్రీను,కాలనీవాసులు పాల్గొన్నారు.

బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలి : కార్పొరేటర్

విద్యుత్ షార్ట్ సర్యూట్ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

వనస్థలిపురం. ఫిబ్రవరి.14.ప్రభాతవార్త : బి.యన్. రెడ్డి. నగర్ డివిజన్ లోని వైదేహి నగర్ శ్రీ షిర్డీ సాయి బాబా ఆలయ సమీపంలో గల సాయి శంకర్ నివాసం లో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్యూట్ జరిగింది. దీంతో పక్కనే ఉన్న గ్యాస్ సిలిండర్ కు మంటలు వ్యాపించడం తో గ్యాస్ సిలిండర్ ఒక్కసారిగా పేలింది. కాలనీ వాసుల ద్వారా సమాచారం అందుకున్న స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని,అగ్నిమాపక సిబ్బంది కి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో,వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్యూట్ ఎలా జరిగిందో విచారణ చేపట్టి,బాధితున్ని ప్రభుత్వం ఆదుకోవాలని సంబంధిత అధికారుల ను కోరారు.

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి ఎమ్మెల్సీ కవిత పరామర్శ

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డిలను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత తదితరులు

ఉప్పల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డిలను శుక్రవారం ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి సత్యవతి రాదోడ్‌లు తదితరులు పరామర్శించారు. బండారి వెంకట్‌రెడ్డి సతీమణి బండారి పద్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలు శుక్రవారం వారి ఇంటికి చేరుకుని లక్ష్మారెడ్డి సోదరులను పరామర్శించారు. బండారి పద్మ మృతి బాధాకరమని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి మున్సిపల్ ఇంజనీర్స్ నేతలు

సిఎం రేవంత్‌రెడ్డి కలిసిన పబ్లిక్ హెల్త్ మున్సిపల్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, వి.లక్ష్మి తదితరులు

ఉప్పల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : సిఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం తెలంగాణ పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజనీర్స్ అసోసియేషన్ కార్యవర్గం కమిటి నేతలు కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.లక్ష్మి గణేష్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, కార్యనిర్వహక కార్యదర్శి వినయ్ దత్, మీడియా కార్యదర్శి గోపాల్ తదితరులు సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

చిలుకానగర్‌లో సుష్మ స్వరాజ్ జయంతి

ఉప్పల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : మాజీ కేంద్ర మంత్రి స్వర్గీయ సుష్మా స్వరాజ్ జయంతి వేడుకలు చిలుకానగర్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బిజెపి చిలుకానగర్ డివిజన్ కమిటి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గౌనె శ్రీకాంత్, గౌనె అంజయ్య, వైద్యుల వీరారెడ్డి, జి.ప్రదీప్‌కుమార్, తిరుపతి సత్యనారాయణ, పి.రాంరెడ్డి, కావలి నరసింహా, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ డిల్లీ ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా స్వర్గీయ సుష్మ స్వరాజ్ చేసిన సేవలు మరువలేనివన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆమె ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కాసుల రామకృష్ణగౌడ్, నరసింహులు, సుమన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జానకి ఎన్‌క్లేవ్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి

జానకి ఎన్‌క్లేవ్ కాలనీవాసులతో టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ , కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

సైదాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: లింగోజిగూడ డివిజన్ పరిధిలోని జానకి ఎన్‌క్లేవ్‌ను టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ గురువారం సాయంత్రం స్థానిక కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. కాలనీలోని సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కాలనీకి సమీపంలో ఉన్న మద్యం దుకాణం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఫిర్యాదు